క్లుప్తంగా

కేసీఆర్ తీరుపై ఏబీవీపీ నిరసన



మలక్‌పేట: సీఎం కేసీఆర్ తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాలరాస్తున్నారని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ కుంచాల సాయిరామ్ ఆరోపించారు. గణతంత్ర వేడుకలపై రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను నిరసిస్తూ గురువారం మూసారంబాగ్ చౌరస్తాలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. విద్యార్థి నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్లకార్డులతో ప్రదర్శన చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు హనుమాన్, రాజేందర్, అభిషేక్, సతీష్, మధు, ఆకాశ్ పాల్గొన్నారు.

వేడుకగా వసంత పంచమి



చిన్నారులకు బుక్స్ అందజేస్తున్న చైర్మన్ మల్లయ్య

చైతన్యపురి: సరస్వతీ మాత పుట్టిన రోజు సందర్భంగా దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయంలో గురువారం వసంత పంచమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. బాలబాలికలచే ససరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి వారిచే అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం చిన్నారులను వేదపండితులు వేద ఆశీర్వచనం చేసి నోట్ బుక్స్, పెన్సిల్స్ అందజేశారని ఆలయ ట్రస్ట్ చైర్మన్ గుండ మల్లయ్య తెలిపారు. ట్రస్ట్ కార్యదర్శి శ్యామలరావు, కార్యవర్గ సభ్యులు, ధర్మకర్తలు పాల్గన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

చంపాపేట: వసంత పంచమి పర్వదినం సందర్భంగా గురువారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని శ్రీ సరస్వతి ఉన్నత పాఠశాలలో చిన్నారులచే సామూహిక అక్ష్యరాభ్యాసం చేయించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల నిర్వాహకులు సరస్వతీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ లెక్కల కృష్ణారెడ్డి, డైరెక్టర్ లలితారెడ్డి ఉపాధ్యాయులు శ్రీనివాస్, నర్సింహ, అమీనా, బీనా, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో భాషా నైపుణ్యం పెంపొందాలి

చైతన్యపురి: విద్యార్థుల్లో భాషా నైపుణ్యం పెంపొందించేలా చూడాలని దిల్‌సుఖ్‌నగర్‌లోని లోటస్‌ల్యాప్ స్కూల్ చైర్మన్ లయన్ కె.గోపాల్ రెడ్డి అన్నారు. పఠన, భాషా నైపుణ్యం పెంచేందుకు పాఠశాలలో నెల రోజుల పాటు తరగతులు నిర్వహించామని ఆయన పేర్కొన్నారు. అనంతరం వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

నాగోలు: గుట్టు చప్పుడు కాకుండా గంజాయి అమ్ముతున్న ఓ వ్యక్తిని ఎల్‌బీనగర్ పోలీసులు అరెస్టు చేశారు. 508 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఎల్‌బీనగర్ ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి సమాచారం మేరకు... నిజామాబాద్ జిల్లా యర్గట్ల మండలానికి చెందిన పందెన సంజీవ్ కుమార్ నగరానికి వచ్చి చింతలకుంట, ఇంజినీర్స్ కాలనీలో నివాసం ఉంటూ వెయిటర్‌గా పనిచేస్తున్నాడు. నిజామాబాద్‌లో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి ఎల్‌బీనగర్ చింతల్‌కుంట ప్రాంతంలో ఎక్కువ ధరకు గంజాయిని విక్రయించేందుకు ఎల్‌బీనగర్ చంద్రపురి కాలనీకి తీసుకొచ్చారు. సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ పోలీసులు బుధవారం రాత్రి సంజీవ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. గంజాయి, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

అపార్ట్‌మెంట్ పై నుంచి పడి కార్మికుడి మృతి

నాగోలు: అపార్ట్‌మెంట్ నిర్మాణ పనులు జరుగుతుండగా ప్రమాదవశాత్తు 5వ అంతస్తు నుంచి పడి భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎల్‌బీనగర్ పోలీసుల సమాచారం మేరకు... నాగోలు బండ్లగూడ శివానీనగర్ కాలనీలో ఓ అపార్ట్‌మెంట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా కనిగిరి, కృష్ణాపురానికి చెందిన రమణయ్య, రమణమ్మ భార్యాభర్తలు. వారి కుమారుడు ఏడు కొండల్(22)తో నగరానికి వచ్చి బండ్లగూడ శివానీ నగర్ కాలనీలో అపార్ట్‌మెంట్ నివాసం ఉంటున్నాడు. అక్కడే భవన నిర్మాణ పనులు చేస్తున్నారు. గురువారం సాయంత్రం పనులు ముగిసే సమయంలో కింద నుంచి ఐదో అంతస్తుకు క్రేన్ సహాయంతో సామగ్రి పంపే సమయంలో 5వ అంతస్తులో ఉన్న ఏడు కొండల్ క్రేన్‌లో ఉన్న సామగ్రిని అందుకునే సమయంలో ప్రమాదవ శాస్తు ఐదవ అంతస్తు నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే ఏడు కొండల్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీనగర్ కాలనీలో గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి



చైతన్యపురి ద్వారకాపురంలో ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి



ఎల్‌బీనగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో అధ్యక్షుడు సామ రంగారెడ్డి



బండి సంజయ్‌తో కలిసి వేడుకల్లో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి లింగాల హరిగౌడ్

మెరిసిన మువ్వన్నెల జెండా

ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల పరిధిలో గణతంత్ర దినోత్సవాన్ని గురువారం వాడవాడలా అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలలు, అన్ని పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రధాన కూడళ్లలో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాల సాధనకు చిత్తశుద్ధితో కృషి చేద్దామని ప్రతినబూనారు. పలు ప్రాంతాల్లో అన్నదానంతోపాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

– ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్‌ల బృందం:



చాదర్‌ఘాట్‌లోని దివ్యాంగుల కార్పొరేషన్‌లో డైరెక్టర్ శైలజ, చైర్మన్ వాసుదేవరెడ్డి...



హస్తినాపురంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ సుజాత నాయక్



బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్



ఎన్టీఆర్‌నగర్‌లో కాంగ్రెస్ సీనియర్ నేత దేప భాస్కర్‌రెడ్డి



నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌యాదవ్



చంపాపేట కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి



మన్సూరాబాద్ చౌరస్తాలో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి



వనస్థలిపురంలో పారిశుద్ధ్య కార్మికులకు ఆహార ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న దీపక్‌రెడ్డి, అద్యుత్‌రెడ్డి



రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో శ్రీత్రివేణి హైస్కూల్ విద్యార్థులు



రంగారెడ్డి జిల్లా కోర్టులో న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది



ఆర్‌కేపురంలో బీఆర్‌ఎస్ నేతలు నగేష్, అరవింద్...



హనుమాన్‌నగర్‌లో రెడ్డి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి



హస్తినాపురంలోని వెల్‌నెస్ ఆస్పత్రిలో...



కుర్మగూడలో మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్



చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా



సలీంనగర్‌లో టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్



దిల్‌సుఖ్‌నగర్ రవీంద్రభారతిలో స్కూల్‌లో...



మాదన్నపేట మార్కెట్‌లో వైస్ చైర్మన్ భూమేశ్వర్

ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టాలి: కాంగ్రెస్



ఎన్టీఆర్‌నగర్‌లో యాత్రను ప్రారంభిస్తున్న దేప భాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టే హాత్ సే హాత్ జోడో పాదయాత్రలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం రామకృష్ణాపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్, అల్కాపురి ఆటో స్టాండ్ పలుచోట్ల రిపబ్లిక్ డే దినోత్సవ సందర్భంగా జాతీయ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రను దేప భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా వ్యతిరేక పాలనను కొనసాగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర స్ఫూర్తితో నియోజకవర్గంలో అన్ని గ్రామాలు, వార్డుల్లో హాత్‌సే హాత్ జోడో పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, రాష్ట్ర నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, బండి మధుసూదన్‌రావు, గట్ల రవీంద్ర, తలాటి రమేష్ నేత, నానవాల జ్ఞానేశ్వర్ యాదవ్ పాల్గొన్నారు.

చైతన్యపురిలో...

చైతన్యపురి: కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఇంచార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో గురువారం చైతన్యపురిలో భారత్ జోడో యాత్ర కొనసాగింపు ర్యాలీ నిర్వహించారు. రాహుల్ గాంధీ సందేశంతో రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాల వైఫల్యాలపై తయారు చేసిన చార్జిషీట్ కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి మాట్లాడుతూ... కేసీఆర్ సర్కార్ ఎన్నికల హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వలేదని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయలేదన్నారు. ప్రాజెక్టుల పేరుతో పేద రైతుల వద్ద తీసుకున్న భూములకు పరిహారం ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ చైతన్యపురి డివిజన్ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్‌యదవ్, సత్యనారాయణ, బాబుగౌడ్, సురేందర్‌రెడ్డి, శ్యాంచరణ్ రెడ్డి, జైపాల్‌రెడ్డి, మంజులారెడ్డి, రమేష్, జానిబాయ్, సౌమ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెయింట్ డామ్నిక్స్ స్కూల్ వార్షికోత్సవం

మలక్‌పేట: సలీంనగర్ సెయింట్ డామ్నిక్స్ స్కూల్ వార్షికోత్సవాన్ని తరంగ్–2023 పేరుతో గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆట పాటలతో సందడి చేశారు. ముఖ్య అతిథిగా ప్రముఖ లైఫ్‌కోచ్ రాజశేఖర్, మోటివేషనల్ స్పీకర్ మాసూద్ అహ్మద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... క్రమశిక్షణతో మెలగాలని, లక్ష్యాన్ని చేరుకోవడానికి ఇష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. సెయింట్ డామ్నిక్స్ విద్యా సంస్థల చైర్మన్ అంకితారెడ్డి, ధీరెన్, ఖమ్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నాగోలు: బీజేపీ మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా అర్బన్ పాలసీ, రీసెర్చ్ ఇన్‌చార్జిగా నాగోలు డివిజన్ బండ్లగూడ ఇంద్రప్రస్థ కాలనీ చెందిన కల్లంశెట్టిలయ నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులను మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతా మూర్తి జారీ చేశారు. ఆ నాయామకపత్రాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ గురువారం కల్లంశెట్టిలయకు అందజేశారు. బీజేపీ జాతీయ పాలసీ, రీసెర్చ్ ఇంచార్జ్ కరుణాగోపాల్ పాల్గొన్నారు.

'ఎట్‌హోమ్'లో పాల్గొన్న కార్పొరేటర్లు నర్సింహారెడ్డి, మధుసూదన్‌రెడ్డి



మన్సూరాబాద్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ గురువారం రాత్రి నిర్వహించిన ఎట్ హోమ్ కార్యక్రమంలో మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, చంపాపేట కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

వరుస చోరీల కేసులో పురోగతి

ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు?

నాగోలు: ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రపురి కాలనీలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన వరుస చోరీల కేసులో పోలీసులు పురోగతి సాధించారు. నగరంలో వరుస చోరీలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర ముఠాలోని ఇద్దరిని నగరంలో పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ సమీపంలో తాళాలు వేసిన ఇళ్లల్లో వరుస ఇళ్ల దొంగతనాలు చోటు చేసుకోవడం స్థానికంగా సంచలనం కలిగించిన విషయం విదితమే. సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా రంగంలోకి దిగిన క్లూస్‌టీం వేలి ముద్రలు సేకరించారు. పాత నేరస్తులుగా గుర్తించారు. వెంటనే రాచకొండ పరిధిలోని సీసీఎస్, ఎస్‌ఓటీ పోలీసులు, ఇతర క్రైమ్ టీమ్ సభ్యులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి చోరీలకు పాల్పడిన ఇద్దరు పాత నేరస్తులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఇద్దరు గతంలో పలు చోరీ కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చినట్లు సమాచారం. ఈ కేసును సవాలుగా తీసుకుని ఎల్‌బీనగర్ పోలీసులు 24 గంటల్లోనే నిందితులను అదుపులోకి తీసుకున్నారు.